# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-11-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**
2. **రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఐదవ రోజు కొనసాగుతున్నాయి.**
3. **ప్రజాస్వామ్యాన్ని పటిష్టపరచడంలో పాత్రికేయ రంగం ముఖ్య భూమిక పోషిస్తోందని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు.**
4. **రాష్ట్రంలో వెనుకబడిన తరగతులకు చెందిన అభ్యర్థుల కోసం ఉచిత డీఎస్సీ శిక్షణను రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు నుంచి ప్రారంభించింది.**
5. **శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం దక్షిణ మధ్య రైల్వే 8 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది.**

==========================

భారత దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఢిల్లీలో ఒక ఆంగ్ల పత్రిక నిర్వహించిన నాయకత్వ సదస్సులో ప్రధాని ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యతరగతి మహిళ సాధికారతకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కృషి సత్ఫాలితాలను ఇస్తోందన్నారు. దేశ వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల నుంచి పదికోట్ల మందికిపైగా మహిళలు లఖ్‌పత్ దీదీలుగా మారారని ప్రధానమంత్రి పేర్కొంటూ...

..వాయిస్..25 సెకన్లు

-------------------------

రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు ఐదవ రోజు కొనసాగుతున్నాయి. ఈరోజు సభ ప్రారంభం కాగానే ఇటీవల మృతి చెందిన మాజీ శాసనసభ్యులకు శాసనసభ సంతాపం ప్రకటించింది. శూన్యగంట సమయంలో పలువురు శాసన సభ్యులు తమ నియోజకవర్గాల సమస్యలను గురించి ప్రసంగిస్తున్నారు. అనంతరం బడ్జెట్ 2024 -25లో రాష్ట్ర రహదారులు, పరిశ్రమల, జల వనరులు, వ్యవసాయం, పౌరసరఫరాలు, గృహనిర్మాణ శాఖల నిధుల కేటాయింపులపై పలు శాఖల మంత్రులు వివరణ ఇవ్వనున్నారు. అలాగే శాసనసభలో టిడ్కో గృహాలపై లఘు చర్చ జరగనుంది. అనంతరం వివిధ శాఖలకు సంబంధించి బడ్జెట్ కేటాయింపులకు శాసనసభ ఆమోదం తెలపనుంది. తర్వాత పలు బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది.

-------------------------

ప్రజాస్వామ్యాన్ని పటిష్టపరచడంలో భాగంగా పత్రికలు నైతికపరమైన, న్యాయమైన, బాధ్యతాయుతమైన కార్యకలాపాలను చేపట్టాలని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ ఈ రోజులాయన ఒక ప్రకటనను విడుదల చేశారు. పాత్రికేయుల సంక్షేమం కోసం ఎన్డీయే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. డిజిటల్ ప్రపంచంలో పాత్రికేయ రంగం సమగ్రతతో వ్యవహరించి ప్రజలకు ఖచ్చితమైన సమాచారాన్ని అందించడానికి కృషి చేయాలని మంత్రి సూచించారు.

---------------------------

రాష్ట్రంలోని వెనుకబడిన తరగతులకు చెందిన డీఎస్సీ పరీక్ష రాసే అభ్యర్థులకు 26 జిల్లా కేంద్రాల్లో ఉచిత శిక్షణను ఈ రోజు నుంచి ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి ఎస్.సవిత ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా 66 శాతం బీసీ, 20శాతం ఎస్సీ, 14శాతం ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందిస్తామన్నారు. 2 నెలలపాటు ఇవ్వనున్న ఉచిత డీఎస్సీ శిక్షణ సమయంలో అభ్యర్థులకు నెలకు వెయ్యి రూపాయల నుంచి 15 వందల రూపాయల వరకు నగదును అందిస్తామన్నారు. త్వరలో ఆన్‌లైన్ లోనూ డీఎస్సీ ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. మెగా డిఎస్సీ కోసం బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని ఒంగోలులోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఆమె ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వెనుకబడిన వర్గాలకు చెందిన 220 మందికి శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. దరఖాస్తు చేసుకున్న అందరికీ శిక్షణ కోసం అవకాశం కల్పించామని కలెక్టర్ తెలుపుతూ,

వాయిస్ ( ... సెకన్లు)

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 116వ సంచిక ఈనెల 24వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 22వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం మచిలీపట్నం-కొల్లాం మధ్య ప్రత్యేక రైలు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 18, 25 తేదీల్లో మచిలీపట్నంలో మధ్యాహ్నం 3 గంటల 15 నిమిషాలకు బయలుదేరి మరుసటిరోజు రాత్రి 9 గంటల 20 నిమిషాలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఇదే రైలు ఈ నెల 20, 27 తేదీల్లో కొల్లాంలో అర్ధరాత్రి 2 గంటల 30 నిమిషాలకు బయలుదేరి 21, 28 తేదీల్లో ఉదయం 7 గంటలకు మచిలీపట్నం చేరుతుందని అధికారులు తెలిపారు. ఈ రైలు పెడన, గుడివాడ, విజయవాడ, న్యూగుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, సింగరాయకొండ, కావలి, నెల్లూరు,

గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, కొయంబత్తూర్, త్రిశూర్, ఎర్నాకుళం, కొట్టాయం, చెంగనూరు స్టేషన్లలో ఆగుతుందని భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

---------------------------

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు సూచించారు. తిరుపతిలోని ఎస్పీ కార్యాలయంలో మాదకద్రవ్యాల నివారణ అవగాహన కరపత్రాలను ఎస్పీ ఈరోజు ఆవిష్కరించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, విద్యార్థులు మాదకద్రవ్యాలు సేవించడం వల్ల కలిగే నష్టాలపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేసి వీటిపై అవగాహన కల్పిస్తున్నామని ఎస్పీ తెలుపుతూ,

వాయిస్ ( 30 సెకన్లు)

---------------------------

రాష్ట్రంలో షెడ్యూల్ కులాల – ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమీషన్‌ను విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. వర్గీకరణపై నిర్దిష్టమైన సిఫార్సులను సూచించడానికి ఈ కమిషన్ బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి 60 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేసింది. వర్గీకరణపై అధ్యయనానికి కమిషన్‌కు అవసరమైన పూర్తి సహకారం అందించాలని సాంఘిక సంక్షేమశాఖ అధికారులను ఆదేశించింది. కమిషన్ కోరిన సమాచారం, పత్రాలు, ఆధార సహిత ధ్రువీకరణలను అన్ని శాఖల అధికారులకు అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

---------------------------

కర్నూలు జిల్లా కప్పట్రాళ్ల అభ్యయారణ్యంలో యురేనియం లభ్యత, పరిశోధన కోసం బోర్ల తవ్వకాల ప్రతిపాదనలపై అన్ని చర్యలను నిలిపి వేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అటవీ శాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. యురేనియం తవ్వకాలకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ప్రభుత్వం పేర్కొన్నట్లు కలెక్టర్ వివరించారు.

---------------------------

ఉభయగోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఓటుకోసం ఇప్పటికి 2 లక్షల 96 వేల 643 మంది దరఖాస్తు చేశారని కాకినాడ జిల్లా కలెక్టర్ ఎస్. షన్‌మోహన్ తెలిపారు. ఈ నెల 6వ తేదీవరకు వచ్చిన దరఖాస్తులపై విచారణ పూర్తి చేశామని, 23న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురిస్తామని తెలిపారు. అదే రోజు నుంచి డిసెంబరు 9 వరకు అర్హత ఉన్న పట్టభద్రులు మళ్లీ ఓటుకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఉప ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేస్తామని, ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.

---------------------------

రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి వివిధ రంగాల్లో పనిచేయడానికి ఐఐటీ మద్రాస్ రాష్ట్ర ప్రభుత్వం 8 ఒప్పందాలు కుదుర్చుకుందని రియల్‌టైమ్ గవర్నెన్స్ సొసైటీ –ఆర్టీజీఎస్ ముఖ్య కార్య నిర్వాహణాధికారి కె.దినేశ్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో ఆర్టీజీఎస్ సెంట్రల్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఐఐటీ మద్రాస్ ప్రతినిధుల బృందం నిన్న సందర్శించి ముఖ్యమంత్రి సమక్షంలో 8 ఒప్పందాలు కుదుర్చుకుందని చెప్పారు.

=====================